# అవసరానికో ఆప్తుడు

(యువ- దీపావళి సంచిక)

అవసరంలో సహాయ పడినవాడే ఆప్తుడు!

వాడే నిజమయిన స్నేహితుడు ! !

కానీ, అవసరార్థం ఓ ఆప్తుణ్ణి బలితీసుకునే

వాళ్ళను ఏమనాలి?....

# అవసరానికో అప్పుడు

"రామచంద్రం!"

పిలుపు విని వెనక్కి తిరిగి చూసేను.

"నువ్వు....మీరు రామచంద్రం కదూ!" అంటూ ఆ వ్యక్తి నా దగ్గరకు వచ్చేడు.

అనుమానంగా అతడి వంక చూస్తూ అవునన్నట్లు తల ఆడించేను.

"....మీరు నర్సీపట్నం స్కూలులో చదివేరు కదూ?" అన్నాడు మళ్ళీ, నా వంక తదేకంగా అప్యాయంగా చూస్తూ.

నా చేతిలోని సూట్‌కేసు చాలా బరువుగా వుంది.

విజయవాడ ప్లాట్‌ఫారంమీద రైలుదిగి లైసెన్సు కూలీకి రూపాయిన్నర ఇవ్వటం యిష్టంలేక, ఓవర్ బ్రిడ్జిమీద నుండి దాన్ని మోసుకుని బయటకు వచ్చేసరికి చేతులు పడిపోయినంత పనయింది.

రిక్షా బేరం చేద్దామనుకునే సమయానికి ఈ శాల్తీ ఎవరో తగిలేడు!

ముఖం పరిచయమయినదిగానే కనబడుతోంది.

కాని పోల్చుకోలేకపోయాను.

అతడి తలవెంట్రుకలు చాలాభాగం నెరిసిపోయాయి.

బిరుసెక్కిన గెడ్డంలో కూడా అక్కడక్కడ పలితకేశాలు దర్శనమిస్తున్నాయి.

కనురెప్పల క్రింద ఏర్పడిన నల్లని మచ్చలు, లోతుకు పోయిన కళ్ళు - ఇవి ఆ మనిషి వయసును పెంచి చెబుతున్నాయి. మాసిపోయిన ఖద్దరు షరాయిమీద, మాసినా తెలియని రంగుగళ్ళలాల్చీ తొడిగేడు. మెడ దగ్గర బొత్తాన్ని కూడా కాజాలో దూర్చి బిగించేడు.

క్షణకాలం అతడి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అతడి వంక చూస్తూ వుండిపోయాను.

సూట్‌కేసు నేలమీదపెట్టి అలసట తీర్చుకుంటూ "అవును, సర్పీ పట్నంలో చదివేను" అన్నాను.

"నా మొదటి ప్రశ్నకే సమాధానం చెప్పేవు. రెండోదానికి చెప్ప లేదు."

"అంటే, నువ్వు నన్ను గుర్తుపట్టలేదన్నమాట !"

అంటూ క్షణకాలం ఎగాదిగా చూసి చిరునవ్వుతో-

"....నువ్వు చలపయ్యగారి అబ్బాయివి .... వి. రామచంద్రానివి! ఏనుగులశాల దగ్గర వుండేది మీ ఇల్లు.... అంతదూరంనుండీ ప్రసాదరావు డాక్టరుగారింటికి నెమలిని చూడటానికి రోజూ వచ్చేవాడివి .... అవునా?" అంటూ అడిగేడు.

అతడు చెప్పినవన్నీ నిజాలే !

మా ఇల్లు ఏనుగుశాల దగ్గరలోనే వుండేది.

నా పేరుతో ఆతడు నన్ను పిలిచినపుడే నన్ను సరిగ్గా పోల్చుకున్నా డని అర్థమయిపోయింది నాకు. మరి, ఈ దండక మంతా యింకా ఎందుకు?

తానెవరో చెప్పొచ్చు కదా!

నాకు విసుగనిపించింది.

అయినా, ఆ విసుగుదల ముఖంలో కనబడనివ్వలేదు.

మళ్ళీ, ఆ వ్యక్తిని గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నించాను.

సాధ్యం కాలేదు!

ఊహూ- అతడే చెప్పుకోవాలి.

ఆ వ్యక్తిని గుర్తుపట్టలేక పోయినందులకు నేను సిగ్గుపడలేదు కానీ, ఎందుకో అతగాడి ముఖంలోకి నేరుగా చూడలేకపోయాను.

అతడి చేతిలో యూరియా బస్తా కాగితంతో కుట్టబడిన చేతి సంచీ వుంది.

ఒకనాడు దాని రంగు తెలుపే అయినా ఈవేళ అది మాసిపోయి బిరుసెక్కి జిడ్డుగా కన్పిస్తోంది.

ఆ సంచీలోంచి ఒక తువ్వాలు, లుంగీ బయటకు తొంగి చూస్తు న్నాయి.

మిగిలిన సామాన్లు అడుగువైపున కూరి వుండటం వలన సరిగ్గా కనబడటంలేదు.

"సారీ! మీరెవరో నాకు గుర్తుకు రావటంలేదు. నన్ను మాత్రం మీరు సరిగ్గా గుర్తించేరు" అన్నాను.

"నేనురా! ప్రకాశాన్ని! నర్సింహం మేస్టారి అబ్బాయిని: రావిచెట్టు దగ్గర వుండేవాళ్ళం కదా! నేనూ, నువ్వూ, లక్ష్మణరావు కలిసి తిరిగేవాళ్ళం" అంటూ చెప్పుకుపోతున్నాడు.

సిగ్గుపడిపోయాను నేను, నిస్సందేహంగా!

వీడు ప్రకాశమా?

నర్సింహం మేస్టారి అబ్బాయా ?

వీడిని గుర్తించలేకపోవటం ఎంత అన్యాయం?

వాడికి ఇరవై ఎనిమిదేళ్ళ వయసు వుండాలి, నా అంచనా సరి యైనదే అయితే !

నాకంటె రెండేళ్ళు చిన్నవాడు! !

అయితే, వాడి ముఖంలో ఈ వృద్ధాప్యపు ఛాయలేమిటి ?

"రేయ్ ప్రకాశం! ఏమీ అనుకోకురా, గుర్తించ లేకపోయాను.... ఇదేమిట్రా ఇలా అయిపోయావ్?" అన్నాను ఆప్యాయంగా.

ఆ మాటలు అంటూ వుంటే గొంతులో ఏదో అడ్డుపడి నట్లయింది.

అది దుఃఖమో, బాధో చెప్పలేను!

ప్రకాశం బదులు పలుకలేదు.

"ఎక్కడనుండి వస్తున్నావ్?" అంటూ అడిగేను.

"ఈ రైల్లోనే దిగేను. ప్లాట్‌ఫారంమీదే నిన్ను చూశాను. అయినా, పలకరించటమా, మానటమా అనే సంశయంలో పడ్డాను. గుర్తించటానికి

కూడా కొంత సమయం పట్టిందనుకో....ఊఁ? నువ్వెక్కడినుండి? విశాఖ పట్నం పోర్టులో పనిచేస్తున్నావని విన్నాను నిజమేనా?" .... అంటూ అడిగేడు.

"పోర్టులో చేరి ఆరేళ్ళయిపోయింది. మా మావగారిది ఈ వూరే! మా ఆవిడ పురిటికి వచ్చింది. చూసిపోదామని వచ్చేను"

"నువ్విపుడు అర్జెంటుగా ఊళ్ళోకి వెళ్ళిపోవాలా?" అంటూ అడిగేడు ప్రకాశం నా వంక అదోలా చూస్తూ.

"ఫరవాలేదు. అలా హోటల్లో కూర్చొని కొంతసేపు కబుర్లు చెప్పుకుందాం" అంటూ నేలమీది సూట్ కేసు అందుకోబోయాను.

ప్రకాశం అడ్డు తగిలేడు.

తానే దాన్ని అందుకుని పట్టుకున్నాడు.

"నేను తీసుకుంటానులే." అంటూ అతడి చేతిలోంచి సూట్ కేసు అందుకోటానికి ప్రయత్నించేను.

"నేను పట్టుకుంటానులే!" అంటూ బలవంతంగా తప్పించుకుని తానే ఉంచుకున్నాడు.

తర్వాత తాపీగా "పద" అన్నాడు.

నేనూ, ప్రకాశం స్కూలులో కలిసి చదువుకున్నాం.

మేం ఫోర్తుఫారం చదువుతూ వుండగా నర్సింహం మేస్టారు గుండె జబ్బుతో చనిపోయారు.

అప్పటినుండీ ప్రకాశానికి కడుపునిండా తిండి కూడా కరువయి పోయింది.

మేనమామ సహాయంతో ఎస్సెల్సీ వరకూ చదివేడు.

ఎస్సెల్సీ పరీక్షల తర్వాత మేమిద్దరం మళ్ళీ యిదే కలుసు కోవటం!

దారిద్ర్యం మనిషిని ఎంత నీచస్థితికి దిగజారుస్తుంది? !

మౌనంగా నడుస్తున్నాం.

ప్రకాశంచేత సూట్‌కేసు మోయించకూడదని మనసు పరి పరి విధాల చెబుతోంది. అయినా వారించలేకపోయాను.

హోటలుకు చేరుకున్నాం.

అంతవరకూ మా మధ్య మాటలు నడవలేదు.

ఒక మూలగా వున్న టేబిలు దగ్గర కూలబడ్డాను.

సూట్‌కేసు, సంచీ ఒక వారగా పెట్టి నా ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు ప్రకాశం.

"కాఫీ త్రాగుదాం!" అన్నాను.

ప్రకాశం రెండు క్షణాలు మౌనంగా వుండిపోయాడు.

తర్వాత మెల్లగా అన్నాడు. "నాకు చాలా ఆకలిగా వుంది. నీ కభ్యంతరం లేకపోతే టిఫిను తింటాను"

నా రెండు చేతులతోటే నా పీక నొక్కుకుని చావాలనిపించింది.

ప్రకాశం వాడిపోయిన ముఖాన్ని చూసి కూడా "నువ్వు టిఫిను తిను" అని ఎందుకు చెప్పలేకపోయాను?

మనసులో చాలా నొచ్చుకున్నాను.

"క్షమించరా ప్రకాశం, నువ్వు కడుపునిండా టిఫిను తిను.... నేను ఏలూరు స్టేషనులో తిన్నాను. రైల్వే గారెలు ఇంకా అరగలేదు. ఇంతలో అరుగుతాయనే నమ్మకం కూడా లేదు. అందుకని, నేను కాఫీ త్రాగుతాను! నువ్వుమాత్రం మొహమాటం పడకుండా కడుపునిండా తిను." అంటూ ఇడ్లీ, దోసె, పూరీ ఆర్డరిచ్చేను. అన్నిటినీ చాలా ఆబగా తిన్నాడు.

తింటూ మధ్యలో గడగడా మంచినీళ్ళు త్రాగుతూ తన కథ ముక్కలు ముక్కలుగా చెప్పుకొచ్చేడు.

ఎస్సెస్సీ తర్వాత చదువుకు అతడి మేనమామ సహాయం చేయలేదట.

రకరకాల ఉద్యోగాలు చేసేడు కానీ దేనిలోనూ నిలదొక్కుకోలేకపోయాడుట!

సినిమాహాలు దగ్గర టిక్కెట్లు ఇవ్వటంలాటి ఉద్యోగాలు ఎన్నో చేసినట్లు చెప్పేడు.

వాడు చెప్పిన ఉద్యోగాలు దేనిలోనూ నాలుగు డబ్బులు మిగిలేవి ఏవీ నాకు కనబడలేదు.

ప్రస్తుతం ఉద్యోగం వెదుక్కుంటూ విజయవాడ వచ్చేను. నువ్వు కన్పించబట్టి సరిపోయింది. లేకపోతే ఈ టిఫినుకు కూడా డబ్బులు లేవు" అంటూ ముగించేడు.

కొంత సేపు ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

కాఫీ తాగుతూ మళ్ళీ వాడే అడిగేడు.

"నీకు సురేంద్ర గుర్తున్నాడా?"

సురేంద్ర శ్రీమంతుల బిడ్డ!

స్కూల్లో మాకు ఓ ఏడాది సీనియరు!

ఇపుడు ఈ వూళ్ళోనే హార్డువేర్ బిజినెస్ చేస్తున్నాడు.

ఏదో పేపరు మిల్లులో చాలా షేర్లు వున్నాయని కూడా విన్నాను. చాలా ఆర్జించేడని తెలిసింది.

ఆ మధ్య ఏదో హత్య కేసులో ఇరుక్కుని నానా కష్టమూ పడి చివరకు బయటపడ్డాడనికూడా తెలిసింది.

ఎందుకో చెప్పలేనుగానీ, సురేంద్రమీద నాకు మొదటినుండీ సదభిప్రాయంలేదు.

అతడు డబ్బు ముసుగులో చేసే అన్యాయాలు చాలా విన్నాను.

"జ్ఞాపకంలేకేం! తెలుసు." అన్నాను.

"ఈ మధ్య కలుసుకోలేదా వాడిని?"

"లేదు. కానీ వాడి గురించి వింటున్నాను."

"ఈ మధ్య సురేంద్ర కలప కొనటానికి నర్సీపట్నం వచ్చేడు. అప్పుడు కలుసుకున్నాను వాడిని. నా పరిస్థితి వివరించి చెప్పేను. నాకు ఒక దారి చూపించమన్నాను. నాకు మాత్రం ఎవరున్నారు? పెళ్ళీ పెటా

కులు ఎలాగూ లేవు. నా ఒక్కడి దినము గడవటానికి దారి చూపించమని వేడుకున్నాను."

"ఏమన్నాడు మరి?"

"నా స్థితికి చాలా జాలిపడ్డాడు. ఇంతకాలం తనకు ఈ విషయం తెలియజేయనందుకు కోపపడ్డాడు. వెంటనే బయలుదేరి విజయవాడ రమ్మన్నాడు. ఖర్చులకోసం రెండువందలు కూడా ఇచ్చేడు. చిల్లర అప్పులన్నీ తీర్చేశాను. కేవలం టిక్కెట్టుకు డబ్బులు మిగిలేయి. సురేంద్ర దారి చూపిస్తాడనే ఆశతో వచ్చేను." అన్నాడు ప్రకాశం.

సురేంద్ర ప్రకాశం యెడల ఇంత దూరంగా ప్రవర్తిచేడంటే నాకు నమ్మబుద్ధి కాలేదు.

ఎందుకంటే సురేంద్రకూ, డబ్బుకీ లంకె!

ఒకసారి నర్సీపట్నం పాత విద్యార్థి సంఘంవారు విరాళం కోసం వెళ్ళితే పది రూపాయలు చేతిలోపెట్టి పొమ్మన్నాడట! కనీసం నూట పదార్లు వస్తాయని ఆశతో వెళ్ళేరు వాళ్ళు.

అంతే కాకుండా, ఏ సంస్థకూ రూపాయి విరాళం ఇచ్చిన సంగతి నేను వినలేదు.

తన దగ్గర పనిచేసే వాళ్ళకే జీతాలు సరిగ్గా ఇవ్వడని సురేంద్ర గురించి అందరూ చెప్పుకుంటారు.

అలాటివాడు ప్రకాశం యెడల ఇంత ఉదారంగా ప్రవర్తించేడంటే ఆశ్చర్యంగానే అనిపించింది.

"నిజంగా నువ్వు అదృష్టవంతుడివే! కాకపోతే సురేంద్రకు ముక్కుమీద కోపం. అందునా ఇప్పుడు నీకు యజమాని వాడు. కాస్త జాగ్రత్తతో వ్యవహరించు" అన్నాను. అంతకంటె ఏంచెప్పాలో తోచలేదు.

"బ్రతుకు తెరువుకోసం పొట్ట చేత్తో పట్టుకుని వచ్చిన వాడిని. నేను దేనికయినా సిద్ధమే! ఏదో దారి చూపిస్తానన్నాడు. అదే పదివేలు" అన్నాడు ప్రకాశం.

అతడు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడాలని యత్నించినా, అతడి కంఠంలో మాత్రం సురేంద్ర యెడల గౌరవం నాకు విన్పిస్తూనే వుంది.

తర్వాత కొద్దిసేపు ఇద్దరం చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకున్నాం.

విశాఖ వస్తే తప్పక మా ఇంటికి రమ్మని నా క్వార్టరు చిరునామా ఇచ్చేను వాడికి.

ఖర్చులకోసం వుంచుకొమ్మని ఇరవై రూపాయల నోటు తీసి ఇచ్చేను.

ప్రకాశం ఆ సహాయాన్ని నిరాకరించలేదు.

ఆ డబ్బు అందుకుంటూ వుంటే వాడి కనులు చెమ్మగిల్లటంమాత్రం గమనించేను.

హోటల్లోంచి బయటకు వచ్చి రిక్షా ఎక్కేను.

* * *

ఈ సంఘటన జరిగిన తరువాత సుమారు సంవత్సరం గడిచిపోయింది.

ఈ మధ్య రోజుల్లో నాకు ప్రకాశం సంగతులేవీ తెలియలేదు.

ఓ రోజు మధ్యాహ్నం భోజనంచేస్తూ వుండగా, బయట నుంచి "రామచంద్రం!" అంటూ కేక విన్పించింది.

"భోజనం చేస్తున్నారు! కూర్చోండి!" అంటోంది మా శ్రీమతి.

అవతలి కంఠం గుర్తుపట్టేను.

అది ప్రకాశానిది!

"ఎవరది? ప్రకాశమేనా?"-అంటూ వంటింట్లోంచే అడిగేను.

"అవునురా నేనే?" అంటూ సరాసరి డైనింగు టేబిలు వద్దకు వచ్చేశాడు.

వాడిని శ్రీపతికి పరిచయం చేశాను.

నేను ఏడాది క్రితం చూసిన ప్రకాశానికీ, ఇప్పటి ప్రకాశానికీ ఏమీ పోలికలు లేవు.

మనిషిలో బాగా మార్పు వచ్చింది.

బెల్ పేంటు, షర్టు వేశాడు.

నెరిసిన తెల్ల వెంట్రుకలకు రంగు వేసినట్లు అలహాకగా తెలుస్తోంది.

'ఎంబాసిడర్ షూ' తొడిగేడు!

దర్జాగా హుందగా వున్నాడు ప్రకాశం!

చేతిలో సిగరెట్ వైభవంగా కాలుతోంది.

"చాలా మారిపోయావ్ ప్రకాశం" అన్నాను.

వాడు సమాధానం చెప్పలేదు.

"నాకు చాలా ఆనందంగా వుంది" అన్నారు మళ్ళీ.

ప్రక్కనున్న కుర్చీ ఇవతలకు లాగి అందులో కూర్చున్నాడు.

"భోజనం చెయ్.... నీకూ వడ్డించమంటాను...."

అంటూ మా ఆవిడ వంక తిరిగి "ప్రకాశానికి అన్నం వడ్డించు" అన్నాను.

"అబ్బే! ఏమీ వద్దురా! ఇప్పుడు స్టేషన్‌కి వెళ్ళిపోవాలి. ఓ ప్రయివేటు కంపెనీలో స్టీలు తుక్కు వేలంపాట వుంటే వచ్చేను. పని సవ్యంగా అయిపోయింది. కడుపునిండా టిఫిను తిన్నాను. ఒక్కసారి నిన్ను చూసి పోదామని ఇటు వచ్చేను. ఓ కప్పు కాఫీ ఇస్తే చాలు!" అన్నాడు.

మా శ్రీపతి కాఫీ కలిపి తీసుకురావటానికి వంటింటిలోకి వెళ్ళింది.

ప్రకాశం ఈ ఏడాది రోజుల్లోనూ తన జీవితంలోని మలుపు గురించి టూకీగా చెప్పేడు.

తాను సురేంద్రకు కుడి భుజంలా తయారయ్యేడట! ముఖ్యమయిన వ్యవహారాలన్నీ తన సలహా తీసుకునే అతడు చేస్తున్నాడట!

తనకు నెలకు ఆరువందలు జీతం ఇస్తున్నాడట.

సురేంద్ర ఇంటివెనుక ఔట్ హౌస్ తన నివాసం!

కేంపులకు వెళ్తే బేటా కూడా బాగా దొరుకుతోంది!

అప్పుడే తన ఎకౌంటులో మూడు వేలకు పైగా జమ వేయటం జరిగినట్లు చెప్పేడు ప్రకాశం.

అంతే కాదు, సురేంద్ర తనను స్వంత ఇంట్లో మనిషిలా చూసు కుంటున్నాడట !

వీటన్నిటికీ మించి మారో ఉపకారం చేశాడట !

అది ప్రకాశం పేర లక్షరూపాయలకు ఇన్సూరెన్సు పాలసీ తీసుకుని ప్రీమియం అంతా తానే కడుతున్నాడట! త్వరలో మంచి సంబంధచూసి పెళ్ళిచేసి ఔట్ హౌస్ తనపేర రాస్తానని కూడా మాట ఇచ్చేడట !!

ఈ విషయాలు చెప్తూవుంటే ప్రకాశం గొంతు గద్గదమయింది.

"సురేంద్ర నిజంగా దేవుడు. అతడి మీద బోలెడు అపప్రథ లున్నాయి. మనిషిపైకి దుర్మార్గంగా కనిపిస్తాడు. కానీ అతడి మనసు నవనీతం. నా యెడల ఎంతో ఆదరంగా వుంటున్నాడు. బహుశః అది నా పూర్వజన్మ సుకృతం"

అంటూ ఆవేశంగా చెప్పేడు ప్రకాశం.

అతడు చెప్పిన మాటలవలన నాకు సురేంద్రమీద దురభిప్రాయం చాలా వరకూ తగ్గిపోయింది.

నిజానికి ప్రకాశానికి నేనూ మిత్రుణ్ణే.

తల్చుకుంటే ఇంతో అంతో సహాయం చేయగల్గిన స్థితిలోనే వున్నాను?

కానీ, ఆలోచన హోటల్లో టిఫెను పెట్టించి, ఇరవై రూపాయల నోటు అతడి చేతిలోపెట్టి, నా దారిన నేను వెళ్ళిపోయాను.

సురేంద్ర స్నేహితుని ఎడల చాలా ఔదర్యం చూపుతున్నాడనే అనుకోవాలి.

మిగిలిన వాళ్ళతో ఎలా ప్రవర్తించినా అది వేరేసంగతి !!

కాఫీతాగి రైలుకు వేళయిపోయిందంటో బయలు దేరాడు ప్రకాశం !

"సురేంద్ర కూడా నిన్ను చూడాలను కుంటున్నాడు.

విజయవాడ వస్తే తప్పకుండా రా ; అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు ప్రకాశం !

* * *

ఆ తరువాత—

మరో తొమ్మిది నెలలకుగానీ నాకు విజయవాడ వెళ్ళటం కుదరలేదు.

మా మావగారికి ఒంట్లో బాగాలేదని ఉత్తరం వస్తే మా శ్రీపతిని పిల్లలను తీసుకొని బయలుదేరెను.

విజయవాడ చేరిన మొదటి రోజంతా ఇల్లు కదలటం కుదరలేదు.

రెండోరోజున మావగార్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి పరీక్షలు చేయించటంతో గడిచిపోయింది.

ఆ మర్నాడు ప్రకాశాన్నీ సురేంద్రనూ చూద్దామని బయలుదేరాను.

సురేంద్ర ఆఫీవుకు నేరుగా వెళ్ళేను.

బీసెంటు రోడ్డువెనుక, పెద్ద ఆవరణలో హార్డువేరు షాపు.

సురేంద్ర ఆఫీసురూము కలిసే వున్నాయి.

ఆవరణ చుట్టూ ఇనుప కంచెవుంది.

ఆవరణ లోపల క్రోటన్ మొక్కలున్నాయి.

ఆవరణ ఎదర గేటుదగ్గర గూర్ఖా వున్నాడు.

ఒకప్రక్క ఆగివున్న లారీల్లోకి కూలీలు ఏవో సామాన్లు ఎక్కిస్తున్నారు.

మెల్లగా గేటుదగ్గరకు వెళ్ళేను.

ఘూర్కాతో సురేంద్రకోసం వచ్చినట్లు చెప్పేను.

అతడు నన్ను సాదరంగా తీసుకువెళ్ళి విజిటర్స్ గదిలో కూర్చో బెట్టాడు.

నా పేరు కాగితంమీద రాసి చీటీ లోనికి పంపేను.

రెండు నిమిషాలలోనే లోనికిరమ్మని పిలుపు వచ్చింది!

సురేంద్ర కూర్చున్న ఎ. సి. గదిలో అడుగుపెట్టేను.

నన్ను చూడగానే సురేంద్ర కూర్చీలోంచిలేచి ఎదురువచ్చేడు.

కౌగిలించుకున్నంత పనిచేశాడు!

ఎన్నోసార్లు విజయవాడవచ్చి తనను కలుసుకోకుండా వెళ్ళి పోతున్నందులకు ఎంతో నిష్ఠూరంగా మాటాడేడు,

తర్వాత బోయ్‌ని పిలిచి కూల్ డ్రింక్స్ రప్పించేడు.

సురేంద్ర యెడల నేను ఈ మధ్యకాలంలో పెంచుకుంటూ వచ్చిన గౌరవం అతడిని కలిసిన క్షణంలో మరింత బలపడింది.

చిన్ననాటి మిత్రుల వివరాలు పేరుపేరునా అడిగి తెలుసు కున్నాడు.

"ఆ మధ్య ప్రకాశం విశాఖ వచ్చినపుడు నీ వివరాలనీ చెప్పేడు. వాడిజీవితంలో నువ్వేదీపం వెలిగించేవని చెప్పి ఎంతో ఆనందించేడు. ----" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాను.

సురేంద్ర ముఖం వాడిపోయింది.

అతని కన్నుల్లో నీళ్ళు తిరిగేయి.

ముఖం ఎర్రగా చేసుకున్నాడు.

రుమాలుతీసి కళ్ళు ఒత్తుకున్నాడు.

"ఇంతకీ ప్రకాశం ---" అంటూ నేను మాటాడబోయే లోగా

నా మాటలకు అడ్డుపడుతూ "ప్రకాశం చచ్చిపోయిన సంగతి నీకు తెలీదా ?" అంటూ అడిగేడు.

నాకు మతి పోయినట్లయింది.

నా చెవులను నేనే నమ్మలేక పోయాను.

"ప్రకాశం చచ్చిపోయాడా ?" అడిగేను ఆశ్చర్యంతో.

"అవును! ఎలక్ట్రిక్ షాక్ తగిలి చచ్చిపోయాడు. ఫేను కోసం ప్లగ్ పెడుతూ వుంటే ఈ దారుణం జరిగింది. నేనూ అక్కడే వున్నాను. నేను విషయం తెలుసుకొనే లోగానే అంతా జరిగిపోయింది....ఇది ఆత్మ హత్య కాదనీ, కేవలం ప్రమాదంవలన జరిగిందనీ ఋజువు చేయటానికి నా తలప్రాణం తోక్కివచ్చింది. ఇరవై వేలు ఖర్చయ్యాయి. ప్రకాశం చాలా మంచివాడు. నాకు అతడే సర్వస్వం అయ్యేడు ఈ మధ్యకాలంలో! ఈ రెండు నెలలుగా నాకు పిచ్చెత్తినట్లుంది అతడు లేకపోవటంతో! అలాటి స్నేహితుణ్ని కోల్పోవటం నా దురదృష్టం !" అంటూ మళ్ళీ కళ్ళు ఒత్తుకున్నాడు. జీవితం ఒక గాడిలో పడి సుఖపడే రోజులు వచ్చిన వేళలో ప్రకాశానికి నూరేళ్లు నిండిపోవటం ఎంత ఘోరం ?

బాధాకరమయిన రోజులు ముగిసి, నికృష్టమయిన జీవితంలోనుండి అందమయిన భవిష్యత్తులోకి అడుగుపెట్టే తరుణంలో ఇలా జరగటము ఎంత విషాదం?

కొంతసేపు మౌనంగా వుండిపోయాను.

మళ్లీ సురేంద్రే అన్నాడు.

"వాడి జీవితానికి ఓ మార్గం చూపాలనుకున్నాను. నా జేట్ హౌస్ ఈ మధ్యనే వాడిపేర రాసేను. ఇంకా రిజిస్ట్రేషన్ చేయించాలనుకుంటూ వుంటే ఇలా అయింది. వాడికి మాత్రం ముందూ వెనకా ఎవరున్నారు ? మా బంధువుల్లో ఒక అమ్మాయిని ఇచ్చి పెళ్ళిచేయాలని కూడా అనుకు న్నాను. కానీ అన్నిటికీ సమయం మించిపోయింది. నా చేతులతోనే వాడిని పిడికెడు బుగ్గిచేశాను."

నేను దీర్ఘంగా నిట్టూర్చేను.

కొద్దిసేపట్లోనే సురేంద్రనుండి శెలవు తీసుకుని బయలుదేరాను.

బయటకు వచ్చేస్తూ వుంటే "విజయవాడ వస్తే కన్పిస్తూ వుండు" అంటూ సాగనంపేడు.

"అలాగే" అని చెప్పి బయటకు వచ్చేను.

రోడ్డుమీద నడుస్తున్నానన్న మాటేగాని మనసు మనసులో లేదు!

ప్రకాశం దీనమయిన రూపం కనులముందు మెదుల్తోంది.

వాడి దురదృష్టానికి చింతించటం మినహా ఏం చేయగలను?

ఇంటికి తిరిగివస్తూ వుంటే మా కజిన్ వెంకట్రావు కన్పించేడు. వాడు ఈ వూళ్లోనే ఇన్సూరెన్స్ ఆఫీసులో పనిచేస్తున్నాడు.

"ఒరేయ్! రామచంద్రం!" అంటూ రోడ్డుమీద పోయే జనమంతా ఒక్క-క్షణం ఆగి, ఇటువైపుకే చూసేలా అరిచేడు.

నాకు దగ్గరగా వచ్చి భుజంమీద గట్టిగా చరిచి, కుశల ప్రశ్నలు వేయటం ఆరంభించేడు.

నేను మూడురోజుల క్రితమే విజయవాడ వచ్చినట్లు తెలుసుకుని నిష్ఠూరంగా మాట్లాడేడు.

"నాకు తెలుసులేవోయ్ నువ్వెందుకు రాలేదో!" అన్నాడు.

"ఎందుకని అనుకుంటున్నావ్ ?"

"ఓ యాభయివేలకి పోలసీ తీసుకొమ్మని చెప్తానని నీ భయం అంతేనా?"

"అబ్బే! అదేంకాదు."

"మరి, వూళ్ళోకి వచ్చి మూడు రోజులయినా నన్ను కలుసుకోలేదంటే ఎలా అర్థంచేసుకోవాలో తెలీటంలేదు. అయినా ఈ మధ్య నా దగ్గరకి బంధువులు, స్నేహితులు రావటం మానేశారు. పిల్లి వున్న ఇంట్లో ఎలకలు తిరిగినట్లు తప్పించుకు తిరుగుతున్నారు. నేనే ఇలా రోడ్డుమీద పట్టేసుకుంటున్నాను. ఊ!....ఏమిటి సంగతి?.... మీ మావగారు యెలా వున్నారు? మొహం అలా వుందేం ? ఆయనకు ఒంట్లో బాగాలేదా కొవం దీసి?...."

"పోలసీ తీసుకోమ్మని ఎన్నిసార్లు చెప్పేనో .... విన్నారు కాదు ఆయన...." అంటూ ఏవేవో పొంతనలేని విషయాలు, అంతా తానే అయి మాట్లాడటం ఆరంభించేడు.

రోడ్డు మధ్యలో నిలబడి అంత గట్టిగా మాట్లాడుతూ వుంటే చచ్చే సిగ్గనిపించింది నాకు.

అందరూ మావైపే చూస్తున్నారు!

నేను మౌనంగా వుండిపోయేసరికి మళ్ళీ వాడే అడిగేడు.

"ఎక్కడనుండి వస్తున్నావ్ ?"

"బిసెంటురోడ్డు వెళ్ళేను!"

"అక్కడెవరున్నారు ?"

"సురేంద్రా అండ్ కంపెనీ వుంది కదా!"

"ఆ సురేంద్రగాడు నీకు తెలుసా ?"

"అతడు నా చిన్నప్పటి స్నేహితుడు, అతన్ని కలుసుకుని వస్తున్నాను!"

వెంకట్రావు నా వంక అదోలా చూసేడు.

"ఏమిటి? సురేంద్ర నీ స్నేహితుడా? వెరీగుడ్! వాడి రొట్టె ఈ మధ్య మరోమారు విరిగి నేతిలో పడింది. వాడి స్నేహితుడు ప్రకాశం అని వుండేవాడులే! వాడు కరెంట్‌షాక్ తగిలి ఆ మధ్య చచ్చిపోయాడు. వాడికి లక్షరూపాయలు పోలసీ వుంది. దానికి 'నామినీ' సురేంద్ర! ఈ రోజుల్లో అదృష్టం కూడా డబ్బున్నవాడినే వరిస్తోంది! మా ఆఫీసులో ఆ పాలసీ గురించి తర్జన భర్జన అవుతున్నాయనుకో! ఏది ఏమైనా, ఈ నెలాఖరుకు సురేంద్రకు లక్ష రూపాయలా అందటం మాత్రం ఖాయం...." అంటూ చెప్పుకుపోతున్నాడు వెంకట్రావు.

ఇక ఆ కబుర్లు ఏవీ నా చెవికి ఎక్కటంలేదు.

"వాడికి లక్షరూపాయల పాలసీ వుంది. దాని నామినీ సురేంద్ర!" అన్నమాటలే చెవుల్లో సుడులు తిరుగుతున్నాయి.